# సాక్షి నల్లగొండ

మంగళవారం । 5 । ఆగస్టు । 2025






## నలుగురి అరెస్ట్

బైక్‌ల నంబర్ ప్లేట్స్ మారుస్తూ గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



## మూసీకి వరద

ఎగువ ప్రాంతాల్లో కురుసున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు 1250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. - 8లో

## సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

| | | |
|---|---|---|
| ప్రస్తుత నీటి మట్టం | : | 586.50 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : | 66,407 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : | 44,132 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : | 28,664 క్యూసెక్కులు |
| కుడికాల్వ ద్వారా | : | 5,088 క్యూసెక్కులు |
| ఎడమకాల్వ ద్వారా | : | 8,280 క్యూసెక్కులు |
| ఏఎమ్మార్పీకి | : | 1,800 క్యూసెక్కులు |
| వరద కాల్వకు | : | 300 క్యూసెక్కులు |

## న్యూస్‌రీల్

### పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కలిగి.. ప్రవేశపరీక్ష రాసి సీటు పొందని వారు, ప్రవేశపరీక్ష రాయకుండా డైరెక్ట్‌గా చేరాలనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాను 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కళాశాల కార్యాలయంలో స్వీకరించి, సంబంధిత ధ్రువపత్రాలను జతపరిచి సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆగస్టు 8వ తేదీన 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### 13న రైతు పోరాట యాత్ర



మాట్లాడుతున్న యాదగిరిరావు

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భారత్ కిసాన్ సభ జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీన రైతు పోరాట యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన రైతు సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. జిల్లాలో యూరియా, ఎరువుల కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మోయినోద్దీన్, బంటు వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, బిల్లా కనకయ్య, రంగారెడ్డి, బండమీద వెంకన్న, బొర్ర శేకర్, దోటి పాండరి, వెంకట్‌రెడ్డి, శాంత, బండమీద యాదయ్య, అంజల్‌రావు, పాండు, దేవేందర్, కాంతారావు, శ్రీశైలం పాల్గొన్నారు.

### రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది : చిరుమర్తి

నార్కట్‌పల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సోమవారం పత్రిక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి డైవర్షన్ పాలిటిక్స్‌పై శ్రద్ధ పెట్టారని మండిపడ్డారు. ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రికి మన సీఎం రేవంత్‌రెడ్డి దాసోహమై నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చెరువులన్నీ నీటితో కళకళలాడేవని.. ఇప్పుడు మట్టిని అమ్ముకునేందుకు చెరువులను ఎండబెడుతున్నారని మండిపడ్డారు.

### గొర్రెల పంపిణీలో అవకతవకలపై విచారణ



నల్లగొండ టౌన్ : గత ప్రభుత్వ హయాంలో రాయితీ గొర్రెల పంపిణీలో జరిగిన అవకతవకలపై నల్లగొండలో సోమవారం నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. పశువుల ఆస్పత్రుల్లో వెటర్నరీ డాక్టర్లను కలువడంతో పాటు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. జిల్లాలో తొలి విడతలో 28,236, రెండో విడతలో 5,696 యూనిట్లు పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు, గొర్రెల మందలేనివారు, గొర్రెలకు బదులు డబ్బులు తీసుకున్నట్లు, గొర్రెలు పంపిణీ చేయకుండా కేవలం ఫొటోలు ఇచ్చి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే గొర్రెలు తెచ్చిన వాహనాల నంబర్లు, రికార్డుల్లోని వాహనాల నంబర్లక సరిపోలక పోవడం గమనార్హం. వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది. రెండు విడతలుగా పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లకు సంబంధించిన రికార్డులను గత సంవత్సరం రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తీసుకెళ్లిన విషయం విదితమే.

## పెండ్లిపాకల ఆయకట్టుకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని పెండ్లిపాకల రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సోమవారం నీటిని విడుదల చేశారు. ఏకేబీఆర్ డి–7 కాలువ ద్వారా పెండ్లిపాకల చెరువుకు తాగునీటి అవసరాలకు, పంటల సాగుకు నీరు చేరింది. ప్రస్తుతం ఈ చెరువులోని నీరు సుమారుగా 500 ఎకరాలకు సరిపోతుందని అందులో భాగంగానే నీటిని విడుదల చేశామని నీటిపారుదల శాఖ ఈ.ఈ నెహ్రూనాయక్ తెలిపారు. కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈఈలు భాస్కర్, సంతోష్‌రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు, అధికారులు

# 5 రోజుల్లోనే లక్ష ఎకరాల్లో..

### ముమ్మరంగా వరి నాట్లు

- ఐదు రోజుల క్రితం 1.25 లక్షల ఎకరాల్లోనే సాగు
- కాల్వలకు నీటిని విడుదల చేయడంతో ఇప్పుడు 2.25 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తి
- నెలాఖరు వరకు మరో 3లక్షల ఎకరాల్లో సాగు కానున్న వరి

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఐదు రోజుల క్రితం వరకు కేవలం 1.25 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేసుకున్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాలువకు, వరద కాలువకు, మూసీ కాల్వలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వరినాటు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. కేవలం ఐదు రోజుల్లోనే రైతులు లక్ష ఎకరాల్లో నాట్లు వేసుకోవడం విశేషం. ఇప్పటివరకు రెండు 2,25,254 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరు వరకు మరో మూడు లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసుకోనున్నారు.

**నాన్ ఆయకట్టులో 90 శాతం పూర్తి..**

జిల్లాలోని నాన్ ఆయకట్టు మండలాల్లో ఇప్పటికే 90 శాతం వరకు వరినట్లు పూర్తికాగా ఆయకట్టు ప్రాంతంలో 30 శాతం మాత్రమే రైతులు వరినాట్లు వేసుకున్నారు. ఈ సారి ఆయకట్టు ప్రాంతంలో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. సాగునీరు విడుదలవుతున్న నేపథ్యంలో ఈ సారి అంచనాకు నుంచి వరి సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంటోంది.



నల్లగొండ సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

**రైతులను వేధిస్తున్న కూలీల కొరత..**

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్లో వరినాట్లకు కూలీలు దొరకడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చత్తీస్‌గఢ్, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన మగ కూలీలతో రైతులు వరినాట్లు వేయిస్తున్నారు. ఎకరాకు రూ.4 వేల నుంచి 5 వేల వరకు కూలీ చెల్లించాల్సి వస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు యాంత్రికరణ పద్ధతిన సాగు చేసుకుని ఖర్చు తగ్గించుకుంటున్నారు.

**సాగు అంచనా ఇలా..**

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో మొత్తం 11.60 లక్షల ఎకరాల్లో పత్తి, వరి, కంది ఇతర పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో పత్తి 5,47,735 ఎకరాలు, వరి 5,25,350 ఎకరాల్లో సాగు కానున్నట్లు అంచనా వేశారు. ఇప్పటివరకు పత్తి 5,42,641ఎకరాల్లో, వరి 2,25,284 ఎకరాల్లో, కంది 1,541, మినుము 16, పెసర 166, ఎకరాల్లో ఇతర పంటలు కలిపి ఇప్పటివరకు 7,69,073 రైతులు సాగు చేశారు. వరి సాగు ఇంకా మూడు లక్షల ఎకరాల్లో పెరిగే అవకాశం ఉంది.

**అధికారుల సూచనలు పాటించాలి**



ఆయకట్టుకు సాగునీరు విడుదలవుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు 3.20 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసుకునే అవకాశం ఉంది. రైతులు ఇప్పటికే వరి నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు వెదజల్లే, డ్రమ్ సీడర్, యంత్రాలు సాగు పద్ధతులను ఎంచుకోవాలి. వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

# విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, పక్కన గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ జిల్లాను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ సమీపంలోని గంధంవారిగూడెంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రంలోనే మొదటిది కావాలన్నారు. 9 నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని తీర్చిదిద్దాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. నల్లగొండలో బాలురకు కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేస్తామన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్లగొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను 25 ఎకరాలలో నిర్మించనున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు మంచి స్థలాన్ని గుర్తించడం జరిగిందని త్వరలోనే అక్కడ శంకుస్థాపన చ,ఏస్తామన్నారు. టీజీఈడబ్ల్యూఎంఐడీసీ ఈఈ బాలప్రసాద్ నల్లగొండలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వివరాలను తెలియజేశారు.

**క్యాంపు కార్యాలయం అందరిది..**

నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అందరిదని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్లో రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాంపు కార్యాలయాన్ని ఆధునాతన సౌకర్యాలతో నిర్మించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు నల్లగొండ వచ్చినప్పుడు ఉండేలా క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యాలయానికి 'ఇందిర భవన్'గా నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ మంత్రి తన క్యాంపు కార్యాలయంలో మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. నార్కట్‌పల్లి పెద్ద చెరువును కూడా నీటితో నింపి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. రూ.1.20 కోట్లతో నిర్మించనున్న బ్రాహ్మణవెల్లెంల గ్రామపంచాయతీ భవనం దక్షిణ భారతదేశంలోనే ఆదర్శంగా ఉండేలా నిర్మించాలని సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో చింతపల్లి, నందిపాడులో రెండు బ్రిడ్జిలను హామ్ విధానంలో చేపట్టనున్నామని, పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రధాన రహదారి నుంచి వైటీపీఎస్‌కు రోడ్డు నిర్మాణానికి రూ.260 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయని, భూసేకరణకు రూ. 31 కోట్లను విడుదల చేసామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, ఆర్డీఓ అశోక్ రెడ్డి, డీఈవో భిక్షపతి, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆఫీస్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 99 ఫిర్యాదులు రాగా వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 56, జిల్లా అధికారులకు సంబంధించినవి 43 ఫిర్యాదులు ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం ఆమె జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నందున మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు దీనిపై దృష్టి పెట్టి పథకాలు వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. విద్య, వైద్యం, స్థానిక పరిపాలన అంశాల్లో మండలాల ప్రత్యేక అధికారులది కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఆర్డీఓలు వై.అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సాగర్‌లో తెలంగాణ లోకాయుక్త



విజయవిహార్‌లో లోకాయుక్తకు స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు

నాగార్జునసాగర్ : తెలంగాణ లోకాయుక్త ఏ.రాజశేఖర్‌రెడ్డి సోమవారం నాగార్జునసాగర్‌కు వచ్చారు. స్థానిక విజయవిహార్‌లో పెద్దవూర మండల తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ దండ శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. వారి వెంట సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

## 23.1 మిల్లీమీటర్ల వర్షం

నల్లగొండ టౌన్ : అల్పపీడన ద్రోణి కారణంగా 30 మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 23.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నకిరేకల్ మండలంలో 76.1 మిల్లీమీటర్లు, కట్టంగూర్‌లో 60.8, అత్యల్పంగా దేవరకొండ మండలంలో 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిట్యాల మండలంలో 31.8, నార్కట్‌పల్లి 23.7, శాలిగౌరారం 36.5, కేతేపల్లి 48.0, తిప్పర్తి 45.3, నల్లగొండ 39.7, కనగల్ 9.6, మునుగోడు 31.0, చండూరు 7.8, మర్రిగూడ 11.6, నాంపల్లి 7.8, గుర్రంపోడు 31.7, అనుముల హాలియా 39.6, నిడమనూరు 21.0, త్రిపురారం 17.6, మాడ్గులపల్లి 12.6, వేములపల్లి 9.1, మిర్యాలగూడ 5.2, దామరచర్ల 26.8, అడవిదేవులపల్లి 46.3, తిరుమలగిరి సాగర్ మండలంలో 46.8, పెద్దవూర 37.0, పెద్దఅడిశర్లపల్లిలో 5.5, గట్టుప్పల్ మండలంలో 23.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

## ఆర్అండ్‌బీ అతిథి గృహంగా మార్చాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్అండ్‌బీ భవనాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌గా మార్చుకోవడం సిగ్గుచేటని, వెంటనే ఆర్అండ్‌బీ అతిథి గృహంగా మార్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం కోమటిరెడ్డి తాపత్రయపడుతున్నాడని ఎద్దేవా చేశాడు. ఎంతో మంది ప్రముఖులు బస చేసిన ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌గా మార్చుకోవడం మూర్ఖత్వం కాదా అని ప్రశ్నించారు. 500 మంది విద్యార్థులకు భోజనాలు పెట్టి 5 వేల మందికి పెట్టించానని ఫోన్‌లో సీఎంతో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని, వారు ఎప్పుడు ఏం మాట్లాడుతారో వారికే తెలియదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, పోతెపాక సాంబయ్య, పోతెపాక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై ప్రజా ఉద్యమాలు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం




సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

నల్లగొండ టౌన్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం నల్లగొండలో జరిగిన ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉద్యమించాలన్నారు. ఈ నెల 6 నుంచి15 వరకు సమస్యలపై సర్వేలు, అధ్యయన బృందాలతో పర్యటనలు, ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు సంతకాల సేకరణ, 20 నుంచి 30వ తేదీ వరకు అధికారులకు వినతులు, గ్రామ పంచాయతీల వద్ద ధర్నాలు చేయాలన్నారు. సెప్టెంబరు 1నుంచి తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. బీజేపీ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం తమకు ఓటు వేయని ముస్లిం మైనార్టీల పౌర సత్వాలను రద్దు చేసేందుకు దొడ్డిదారిన ఓట్లు తొలగిస్తోందని ఆరోపించారు. బిహార్ ఎన్నికల వేళ 65 లక్షల ఓట్లను తొలగించారని, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఓట్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభం కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించాల్సిన ధైర్యం మోదీకి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాళేశ్వరం, బనకచర్ల పేరిట ప్రజల దృష్టిని మళ్లిస్తోందని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై బలమైన పోరాటాలు చేసి పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, శ్రీశైలం, లక్ష్మీనారాయణ, సయ్యద్ హాశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సాగు నీరివ్వాలని రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నల్లగొండ టూటౌన్ : తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లోని భూములకు ఏఎమ్మార్పీ డీ–39, డీ–40 కాలువల ద్వారా సాగుకు నీరందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్లగొండలోని నీటిపారుదల శాఖ కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో సాగు నీరందించకుండా ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోందన్నారు. నల్లగొండ నియోజకవర్గం దాటి ఏఎమ్మార్పీ నీరు పోతున్నా ఇక్కడి రైతాంగానికి ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, ముకిరాల కృష్ణ, గుండెబోయిన రామచంద్రు, నాగరాజు, దేవిరెడ్డి లింగారెడ్డి, బొల్లెద్దు వెంకన్న, అంతటి చెన్నకేశవులు, చింతకుంట దయాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జనార్థన్, వెంకన్న, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



హాలియాలో సైకిల్ యాత్రలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

హాలియా : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సంరక్షణ, ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం హాలియాకు చేరుకుంది. ఈ యాత్రకు పెద్ద ఎత్తున విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి లేని కేబినెట్‌గా మార్చారని విమర్శించారు. విద్యారంగంపై సమీక్ష చేయలేని పరిస్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని మండిపడ్డారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, స్పందన, కోరె రమేష్, రవీందర్, వెంకటేష్, కిరణ్, జగదీష్, జగన్, వీరన్న, రాకేష్, భార్గవ్, ఎస్ఆర్ సాయి ఉన్నారు.

## క్లుప్తంగా

### తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి


సుధాకర్ (ఫైల్)

వలిగొండ: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు వట్టిపెల్లి సుధాకర్‌గౌడ్(55) రోజుమాదిరిగా సోమవారం కల్లు గీయడానికి గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలోని గ్రామస్తులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

### బైక్ అదుపుతప్పి..

తుర్కపల్లి: బైక్‌పై వెళ్తుండగా గేదె అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం రుస్తాపూర్ గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన దేవరకొండ రాకేష్(28) భువనగిరి పట్టణ కేంద్రంలోని యాక్సిస్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం తన సహ ఉద్యోగి హరీష్‌తో కలిసి తుర్కపల్లి మండల కేంద్రంలో ఓ కస్టమర్‌ను కలిసి అతడితో మాట్లాడి తిరిగి భువనగిరికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తుర్కపల్లి మండలం రుస్తాపూర్ గ్రామ పరిధిలో అకస్మాత్తుగా గేదె రోడ్డుకు అడ్డంగా రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న రాకేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బైక్ నడుపుతున్న హరీష్ హెల్మెట్ ధరించడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడి భార్య శ్రీజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

నార్కట్‌పల్లి: రోడ్డు దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని నల్లగొండ చౌరస్తా సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అర్థం కృష్ణవేణి నల్లగొండ చౌరస్తా సమీపంలో రోడ్డు దాటుతుండగా బస్టాండ్ వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 వాహనంలో కామినేని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### జూదరులపై కేసు నమోదు

చిట్యాల: చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకాపర్తి గ్రామ శివారులోని తిరుమలనాథస్వామి ఆలయం గుట్టపై కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లగా.. ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.5850 నగదు, మూడు బైక్‌లు, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# శ్రీశైలం దర్శనానికి వెళ్లొస్తూ..

- ఆటోను ఢీకొట్టిన ట్రావెల్స్ వాహనం
- ఒకరు మృతి, 13 మందికి గాయాలు


పంటపొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ట్రావెల్స్ వాహనం


మంగీలాల్ మృతదేహం

శాలిగౌరారం: ట్రావెల్స్ వాహనంలో శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లొస్తూ.. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్ట డంతో ఒకరు మృతిచెందారు. మరో 13 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. స్థానిక ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం .. మహబూబాబాద్ మండలం పత్తిపాక గ్రామ పంచాయతీ పరిధిలోని వినాయకతండాకు చెందిన 14 మంది తాపీమేస్త్రీలు ట్రావెల్స్ వాహనంలో ఆదివారం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం వీరు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. డ్రైవర్ గుండెపాక నవీన్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ సోమవారం తెల్లవారుజామున 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టాడు. దీంతో ట్రావెల్స్ వాహనం రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న బానోతు మంగీలాల్(47) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బానోతు రమేశ్, బానోతు లాలూ, భూక్య సర్వం, అంబోతు శ్రీను, గుగులోతు నరేశ్, భూక్య వీరన్‌కు తీవ్రగాయాలు కాగా.. మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య బానోతు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### • కంపచెట్లు దాటుకుంటూ..



మునుగోడు పెద్ద చెరువు కబ్జాకు గురవుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఉదయం ఆ చెరువును పరిశీలించారు. చెరువు వద్దకు వెళ్లే క్రమంలో కట్టపై కంప చెట్లు అడ్డుగా ఉన్నా.. ఎమ్మెల్యే వాటిని చేతితో పక్కకు జరుపుతూ చెరువు పరిసరాలను పరిశీలించారు. కబ్జాకు గురైన చెరువు భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

– మునుగోడు

# గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

- నిందితుల్లో ఒకరు మైనర్
- 7 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి: బైక్‌ల నంబర్ ప్లేట్స్ మారుస్తూ ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. సోమవారం నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండల పరిధిలోని వివేరా హోటల్ ఎదుట సోమవారం తెల్లవారుజామున పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు బైక్‌లపై ఒరిస్సాలోని మల్కాన్‌గిరికి చెందిన జీబన్ డెపారి, కిరన్ బైద్యా, సుధాషేన్ సాలేతో పాటు మరో బాలుడు హైదరాబాద్ వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా 7 కిలోల గంజాయి లభ్యమైంది. అంతేకాకుండా రెండు బైక్‌ల నంబర్ ప్లేట్స్ అసలైనవి కావని పోలీసులు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. బాదల్ దాకువ అనే వ్యక్తి ఒరిస్సాలోని మల్కాన్‌గిరిలో ఉంటూ సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అక్కడ తక్కువ ధరకు గంజాయి కొని హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో గంజాయి అవసరం ఉన్న వారితో పరిచయం పెంచుకున్నాడు. ఎక్కువ మొత్తంలో గంజాయి తరలిస్తే పోలీసులు పట్టుకుంటారని భావించి ఒరిస్సాకు చెందిన కొంతమందిని ఎంపిక చేసుకుని, బైక్‌ల నంబర్ ప్లేట్స్ మార్చి 7 నుంచి 10 కేజీల గంజాయి హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. గంజాయి తరలించే వారికి రోజుకు ఒక్కొక్కరికి రూ.3వేలు ఇస్తున్నాడు. ఈ క్రమంలో జీబన్ డెపారి, కిరణ్ బైద్యా, సుధాషేన్ సాతే, మరో బాలుడు కలిసి బాదల్ దాకువతో ఒప్పందం చేసుకుని బైక్‌ల నంబర్ ప్లేట్స్ మార్చి ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు 7 కిలోల గంజాయిని బైక్ డిక్కీ, సీటు కింద పెట్టుకుని తరలిస్తుండగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. నలుగురు నిందితుల నుంచి రెండు బైక్‌లు, 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. బాదల్ దాకువ అనే వ్యక్తిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది రాము, జవహర్, రమేష్, సత్యనారాయణ, శ్రీకృష్ణ, శివ, తిరుమలేష్ ఉన్నారు.

### రిమాండ్‌కు తరలించాలని ఎస్పీకి ఫిర్యాదు

సూర్యాపేటటౌన్: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్యను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని మృతుడి సోదరుడు సోమవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి ఫిర్యాదు చేశాడు. మృతుడి సోదరుడు బొప్పని దావీదు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన బొప్పని గురవయ్య బండమీది చందుపట్ల గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా.. అతడి భార్య ధనలక్ష్మి అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి రాజుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం గురువయ్యకు, అతడి కుటుంబ సభ్యులకు తెలియడంతో పలుమార్లు ధనలక్ష్మిని మందలించారు. దీంతో ఎలాగైనా తన భర్త గురవయ్య అడ్డు తొలగించుకువాలని భావించిన ధనలక్ష్మి, తన ప్రియుడు వడ్డేపల్లి రాజుతో కలిసి జూలై 12న సూర్యాపేటలోని చర్చి కాంపౌండ్ గురువయ్యను కొట్టి చిత్రహింసలకు గురిచేసి బలవంతంగా గడ్డి మందు తాగించారు. విషయం తెలుసుకున్న గురువయ్య కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జూలై 14వ తేదీన మృతిచెందాడు. జూలై 16న సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా.. ధనలక్ష్మితో పాటు ఆమె ప్రియుడు వడ్డేపల్లి రాజుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గురవయ్య సోదరుడు దావీదు తెలిపారు.

### ఇద్దరు కానిస్టేబుళ్లపై..


తిప్పర్తి: తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరు కానిస్టేబుళ్లకు ఓ బైక్ దొరకగా.. దానిని రిపేర్ చేయించి సర్వారం గ్రామానికి చెందిన వ్యక్తి అమ్మారు. అయితే బైక్ కొనుగోలు చేసిన వ్యక్తి ముందు మాట్లాడుకున్నట్లుగా మొత్తం డబ్బులు చెల్లించలేదు. దీంతో మొత్తం డబ్బులు ఇవ్వాలని అతడిపై కానిస్టేబుళ్లు ఒత్తిడి తెచ్చారు. దీంతో సదరు వ్యక్తి ఎస్‌ఐకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ బైక్ రిపేర్ చేసిన మెకానిక్‌ను పిలిపించి విచారించగా.. అతడు బైక్ వివరాలను చెప్పాడు. ఇద్దరు కానిస్టేబుళ్లపై జిల్లా ఎస్పీకి నివేదిక పంపించామని, వారిపై ఎస్పీ శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని ఎస్‌ఐ తెలిపారు.

# గోశాల విస్తరణకు స్థల పరిశీలన


టెంపుల్ సిటీపై స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్, ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన గోశాల విస్తరణకు గాను టెంపుల్ సిటీపై స్థలాన్ని ఈఓ వెంకట్రావ్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ఆలయ గోశాలను మల్లాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో దేవస్థానం తోటలో నిర్వహిస్తున్నారు. దీనిని విస్తరించేందుకు టెంపుల్ సిటీపై గోశాలను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు ఈఓ వెల్లడించారు. అనంతరం టెంపుల్ సిటీపై వేద పాఠశాలకు సంబంధించిన స్థలంలో చేస్తున్న పనులను పరిశీలించారు. వేద పాఠశాల నిర్మాణంపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అక్కడే జరుగుతున్న భూముల సర్వేను పరిశీలించి, వైటీడీఏ పరిధిలోని భూములను పకడ్బందీగా నిర్వహించాలని సర్వేయర్లకు తెలిపారు. కొండపైన భక్తుల సౌకర్యార్థం క్యూలైన్ బ్రిడ్జి ఏర్పాటు కోసం అధికారులు, అర్చకులతో చర్చించి, పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

# మూసీ ప్రాజెక్టుకు 1250 క్యూసెక్కుల వరద


వరద నీటితో నిండుకుండలా ఉన్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: హైదరాబాద్ నగరంతో పాటు ఎగురవన మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు సోమవారం వరద పెరిగింది. ఆదివారం సాయంత్రం 240 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 1250 క్యూసెక్కులకు పెరిగింది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి మట్టం 642.90 అడుగులు ఉంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 362 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 285 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. లీకేజీ, సీపేజీ, ఆవిరి రూపంలో 60 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.91 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

# విషపూరితమైన మొక్కలు తిని 150 గొర్రెలు మృతి


మృత్యువాత పడిన గొర్రెలు

మునగాల: విషపూరితమైన మొక్కలు తిని సుమారు 150 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా దువ్వాడ మండలం హనుమాన్‌పల్లి గ్రామానికి చెందిన కొర్ల శివకుమార్‌కు చెందిన గొర్రెల మంద మేత కోసం కొంతకాలం క్రితం మునగాల మండలం చేరుకుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం మేతకు వెళ్లి వచ్చిన గొర్రెల మందలోని 150 గొర్రెలు సాయంత్రం అకస్మాత్తుగా మృత్యువాత పడ్డాయి. గొర్రెల కాపరులు మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ పశువైద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి గొర్రెలను పరిశీలించి విషపూరితమైన మొక్కలు తినడం వలన మృతిచెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతిచెందిన గొర్రెల విలువ రూ.15లక్షల వరకు ఉంటుందని గొర్రెల కాపరులు తెలిపారు.

### మహాశివుడికి అభిషేక పూజలు


స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. కొండ పైన యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు జరిపించారు. మహాశివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను సంప్రదాయంగా చేపట్టారు. ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, జోడు సేవ జరిపించారు.

# మదర్సా నుంచి పారిపోయిన ఇద్దరు విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలోని మదర్సా నుంచి సోమవారం తెల్లవారుజామున ఇద్దరు విద్యార్థులు గోడ దూకి పారిపోయారు. రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రానికి చెందిన జానీపాష కుమారుడు షేక్ ఉస్మాన్ అఖిల్, షఫీ కుమారుడు షేక్ అయాబ్ మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీలోని మదర్సా మదీనా తుల్ ఉలుమ్‌లో చదువుతున్నారు. ఉస్మాన్ అఖిల్ రెండు ఏళ్ల క్రితం ఇక్కడ చేరగా.. అయాబ్ ఏడాది క్రితం చేరాడు. వీరిద్దరు సోమవారం తెల్లవారుజామున మదర్సాలో అందరూ నిద్రపోతుండగా గోడ దూకి పారిపోయారు. దీంతో మదర్సా సిబ్బంది విద్యార్థుల కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా.. వారు ఇంటికి రాలేదని చెప్పారు. ఎంత వెతికినా విద్యార్థుల ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం రాత్రి మదర్సా స్టాఫ్ ఎస్‌కే యూసుఫ్ బాబా మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


నరసింహాచారి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: అతివేగంగా వచ్చిన లారీ రోడ్డు పక్కన నిల్చున్న యువకుడిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం మిర్యాలగూడ టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి ఇందిరమ్మకాలనీకి చెందిన కన్నెకంటి నరసింహాచారి(31) పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పెయింటింగ్ పనులు ముగించుకుని రాత్రి 11:15 గంటలకు రాజీవ్‌చౌక్ సమీపంలో రోడ్డు పక్కకు తన బైక్‌ను పార్కింగ్ చేసి నిల్చున్నాడు. అదే సమయంలో గుంటూరు నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి అదుపుతప్పి రోడ్డు పక్కన నిల్చున్న నరసింహాచారిని ఢీకొట్టింది. దీంతో అతడి తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి లారీని అడ్డగించారు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నరసింహాచారి తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా.. అతడి మేనమామ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ప్రేమించిన యువతి మోసం చేసిందని..

- ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


కార్తీక్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: ప్రేమించిన యువతి మోసం చేసిందని మనస్తాపం చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో సోమవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కేశబోయిన సైదులు, సుజాత దంపతుల పెద్ద కుమారుడు కేశబోయిన కార్తీక్(26) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కార్తీక్ ఓ యువతిని ప్రేమించి ఎవరికీ తెలియకుండా వివాహం చేసుకున్నట్లు సమాచారం. తల్లిదండ్రుల వద్ద ఉంటున్న సదరు యువతి గత కొద్దిరోజులుగా కార్తీక్‌కు ఫోన్ చేయకపోవడంతో పాటు రెండు రోజుల క్రితం మరో వ్యక్తితో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు కార్తీక్‌కు తెలిసింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కార్తీక్ సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే కార్తీక్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

# బీటీ పత్తిని ఆశించే పురుగులు–నివారణ చర్యలు

పాడి-పంట



పెద్దవూర: రైతులు బీటీ పత్తి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించటం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి పి. సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సేంద్రియ ఎరువుల వాడటం, అధికారులు సిఫారసు చేసిన పురుగు మందులను వాడాలని ఆయన పేర్కొంటున్నారు.

**రసం పీల్చే పురుగులు**

– తొలి దశ(1 నుంచి 60 రోజులు): బీటీ పత్తి పంటలో తొలి దశలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులు ఆశించకుండా విత్తన శుద్ధి చేయాలి. దీని వలన దాదాపు 30 రోజుల వరకు పురుగులను అరికట్టవచ్చును. విత్తన దుకాణాల్లో లభించే అన్ని రకాల అనుమతి పొందిన బీటీ వంగడాలు విత్తన శుద్ధి చేసినవే లభిస్తాయి. ఒకవేళ విత్తన శుద్ధి చేయకపోతే ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూఎస్ లేదా థయామిథాక్సామ్ 70 డబ్ల్యూఎస్ మందులను ఒక కిలో విత్తనానికి 4 నుంచి 5 గ్రాముల వరకు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. నత్రజని ఎరువులను సరైన మోతాదులో సకాలంలో వేయకపోతే పురుగు ఉధృతి ఎక్కువ అవుతుంది. సేంద్రియ ఎరువులను విధిగా ఉపయోగించటం వలన నేల సత్తువ పెరుగుతుంది. అంతర పంటలైన సోయాచిక్కుడు, పెసర, మినుము, బొబ్బర, కొర్ర వంటి పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగులు బాగా వృద్ధి చెంది కొంతవరకు రసం పీల్చు పురుగుల నియంత్రణకు దోహదపడతాయి.

**పూత పద్ధతి:** తొలి దశలో ఆశించే పురుగులను అదుపు చేయటానికి కాండం మీద పూత పద్ధతిని పాటించాలి. 3 పర్యాయాలు 30, 45 రోజులలో మోనోక్రోటోఫాస్ 1:4(ఒక భాగం మందు, 4 భాగాలు నీళ్లు) నిష్పత్తిలో వాడాలి. తిరిగి 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ 1:20 నిష్పత్తిలో(ఒక పాళ్లు మందు, 20 పాళ్లు నీరు) వాడాలి. కాండం, పూత పద్ధతి ద్వారా పచ్చదోమ, పేనుబంక, పిండినల్లి పురుగులను ఎటువంటి పురుగు మందులు లేకుండా 70–80 రోజుల వరకు అదుపు చేసుకోవచ్చు. మందులను పిచికారీ చేయకపోవడం వలన తొలిదశలో మిత్ర పురుగుల సంతతి పెరిగి చీడపీడలను అదుపు చేయడంలో సహకరిస్తాయి. రసం పీల్చు పురుగుల నివారణకు 5శాతం వేపగింజల కషాయం వాడాలి.

**కాయ తొలుచు పురుగు**

60 నుంచి 90 రోజుల పంట దశలో పత్తి పైరులో సాధారణంగా పూత ఏర్పడిన దగ్గరి నుంచి కాయ తొలుచు పురుగులు ఆశించటం మొదలవుతుంది. ముఖ్యంగా తలనత్త, శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగులు పంటను వివిధ దశల్లో ఆశించి తీవ్ర నష్టం కలిగిస్తాయి. ఎకరంలో 50 శాతం మొక్కల్లో కనీసం ఒక్కొక్క మొక్కను ఒక గూడ కంటే ఎక్కువ నష్టపోతే (పురుగు చేసిన రంధ్రంతో విచ్చుకున్న గూడలు) 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేస్తే శనగపచ్చ పురుగు గుడ్లను, మొదటి దశ గొంగళి పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. బీటీ క్రిమిసంహారక మందులను బీటీ వంగడాలపై వాడకూడదు. వృక్ష మందులైన వేపగింజల కషాయం 5 శాతం లేదా 0.5 శాతం వేపనూనె లేదా 0.2 నుంచి 0.5 శాతం పిచికారీ చేయవచ్చు. పొగాకు లద్దె పురుగు నివారణకు లీటరు నీటికి 1.0 మి.లీ. నోవల్యూరాన్ లేదా 1.0 మి.లీ. లూఫెన్యూరాన్ లేదా ఇమామెక్టిన్ బెంజోయెట్‌ను 0.5 మి.లీ. పిచికారీ చేయాలి.

**ఆశించు దశ:** 90 నుంచి 120 రోజుల దశలో శనగపచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. 90 రోజుల నుంచి బీటీ పత్తిలో గూడ, పిందెలలో ఉండే బీటీ ప్రోటీన్ స్థాయి క్రమేపి తగ్గుతూ ఉండటం వలన శనగపచ్చ పురుగుల నియంత్రణ తగ్గుతూ ఉంటుంది. ఈ దశలో ఏవైనా గొంగళి పురుగుల నష్టపరిమితి స్థాయి గమనిస్తే 1 లేదా 2 పర్యాయాలు క్రిమి సంహారక మందులు ఉపయోగించటం ద్వారా పురుగును అదుపు చేయవచ్చు. థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. ను పిచికారీ చేయాలి. రెండోసారి పిచికారీగా సైపనోసాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 1.0 మి.లీ. చొప్పున ఒక లీటరు నీటికి కలిపి ఏదో ఒక మందును మార్చి మార్చి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు సిఫార్సు చేసిన పురుగు మందులను 3 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 2.0 మి.లీ. ఫిప్రోనిల్ లేదా .03 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 1.25 గ్రాముల డైఫెనిథియురాన్ లీటరు నీటికి కలిపి వాడాలి.

### గులాబీ రంగు, పిండినల్లి పురుగు

120 రోజుల తర్వాత పత్తి పంటలో గులాబీ రంగు పురుగు, పిండినల్లి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. గులాబీ రంగు పురుగు నష్టపరిమితి స్థాయిని గమనించి పత్తి పంటలో అక్కడక్కడా కొన్ని కాయలను కోసి తెరిచి చూడాలి. పది కాయలకు ఒక లార్వా ఉంటే నష్టపరిమితి స్థాయి అధికంగా ఉన్నట్లు గుర్తించాలి. అవసరం మేరకు పంట చివరి దశలో ఒకటి లేదా రెండు పర్యాయాలు సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను పిచికారీ చేయడం ద్వారా గులాబీ రంగు పురుగును నివారించవచ్చు. అదేవిధంగా పెద్ద గొంగళి పురుగులను ఏరి నాశనం చేయాలి. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ లేదా ప్రొఫెనోఫాస్ మందులను వాడాలి. పంట విత్తిన వెంటనే 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించినట్లయితే ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను పెట్టాలి. బుట్టలో 8 తల్లి రెక్కలు పడినట్లయితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.